# ప్రణయ్ తప్ప..

**థామస్ కప్‌లో భారత్‌కు ఇండోనేషియా షాక్**



చెంగ్డూ: ప్రతిష్టాత్మక థామస్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టుకు ఇండోనేషియా షాకిచ్చింది. గ్రూప్ దశ చివరి లీగ్ మ్యాచ్‌లో ఇండోనేషియా 4-1 తేడాతో భారత్‌ను ఓడించి 2022 థామస్ కప్ ఫైనల్స్ ఓటమికి బదులు తీర్చుకుంది. హెచ్‌ఎస్ ప్రణయ్ తప్ప రెండు సింగిల్స్, రెండు డబుల్స్ మ్యాచ్‌లలోనూ భారత్‌కు ఓటమే ఎదురైంది. ప్రణయ్ 13-21, 21-12, 21-12 తేడాతో ఆంథోని గింటింగ్‌ను ఓడించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. కానీ వరల్డ్ నంబర్‌వన్ డబుల్స్ జోడీ సాత్విక్- చిరాగ్.. 22-24, 24-22, 21-19 తేడాతో షోయిబుల్ ఫిక్రి-బగస్ మౌలానా చేతిలో ఓడింది. లక్ష్యసేన్.. 18-21, 21-16, 17-21 తేడాతో జొనాథన్ క్రిస్టీతో పోరాడి ఓడాడు. రెండో డబుల్స్‌లో ధ్రువ్-సాయి 22-20, 21-11 తో లియో రొలీ-డానియల్ మార్టిన్‌కు తలవంచారు. చివరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-19 తేడాతో తొలి గేమ్ గెలిచినా ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లలో 22-24, 14-21 కోల్పోయాడు. ఈ ఓటమితో భారత్ గ్రూప్ దశలో రెండో స్థానంలో నిలిచింది.

# సెమీస్‌లో నలుగురు

**ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**



అస్తానా: ఆసియా అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు అదరగొడుతున్నారు. బుధవారం నలుగురు బాక్సర్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. 51 కిలోల విభాగంలో ఆర్యన్ 5-0 తేడాతో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ జురెవ్‌పై అలవోకగా నెగ్గాడు. 71 కిలోల విభాగంలో ప్రియాన్షు, 80 కేజీల కేటగిరీలో సాహిల్ రిఫరీ స్టాప్ ది కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) నిర్ణయంతో విజయాలు నమోదుచేశారు. యశ్వర్ధన్ (63.5 కిలోలు) 4-1 తేడాతో ఇరాన్ బాక్సర్ బాబా హైదరిని ఓడించి సెమీస్‌కు చేరాడు. ఈ టోర్నీలో ఇదివరకే బ్రిజేష్, సాగర్, సుమిత్, జుగ్ను, తమన్నా, ప్రీతి సెమీఫైనల్స్ చేరారు.

# చెన్నైకి కింగ్స్ చెక్

## సీఎస్‌కేపై పంజాబ్ ఘన విజయం

**రాణించిన బ్రర్, చాహర్**

**రుతురాజ్ ఇన్నింగ్స్ వృథా**

**ఇటీవలే కోల్‌కతా వేదికగా టీ20 క్రికెట్‌లో అత్యధిక ఛేదన (262)ను మరో 8 బంతులు మిగిలుండగానే పూర్తిచేసి రికార్డులు సృష్టించిన పంజాబ్ కింగ్స్ చెన్నైలో బంతితో మెరిసింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సొంతగ్రౌండ్ చెపాక్‌లో ఆ జట్టును తక్కువ స్కోరుకే కట్టడిచేసి తర్వాత లక్ష్యాన్ని నెమ్మదిగా పూర్తిచేసింది. స్పిన్నర్లు చాహర్, బ్రర్.. చెన్నై దూకుడుకు చెక్ పెట్టారు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తప్ప మిగిలినవారంతా విఫలమయ్యారు. ఛేదనలో పంజాబ్ మరీ ధాటిగా ఆడకపోయినా లక్ష్యాన్ని పూర్తిచేసి ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది.**



హర్‌ప్రీత్ (2/17)

చెన్నై: పంజాబ్ కింగ్స్ మరోసారి సమిష్టి ప్రదర్శనతో రాణించి చెన్నై సూపర్ కింగ్స్ సొంత డెన్ అయిన చెపాక్‌లో రుతురాజ్ సేనకు చెక్ పెట్టింది. బుధవారం సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును 163 పరుగులకే కట్టడిచేసిన పంజాబ్.. లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో పూర్తిచేసి 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత చెన్నైని పంజాబ్ కట్టడిచేయడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 162 పరుగులకే పరిమితమైంది. రుతురాజ్(48 బంతుల్లో 62, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పంజాబ్ స్పిన్నర్లు రాహుల్ చాహర్ (2/16), హర్‌ప్రీత్ బ్రర్ (2/17) సీఎస్‌కే భారీ స్కోరు చేయకుండా కట్టడిచేశారు. అనంతరం ఛేదనలో పంజాబ్.. 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది. బెయిర్ స్టో ( 46), రిలీ రూసో (43) ధాటిగా ఆడారు. హర్‌ప్రీత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### రుతురాజ్ ఒక్కడే..

ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న రుతురాజ్ గైక్వాడ్ మరోసారి చెన్నైకి ఆపద్బాంధవుడిగా నిలిచాడు. సీఎస్‌కే ఇన్నింగ్స్ తొలి 4 ఓవర్లలో వికెట్లను కాపాడుకోవడానికి ప్రాధాన్యమిచ్చిన రుతురాజ్-రహానే (24 బంతుల్లో 29, 5 ఫోర్లు) ఐదు, ఆరో ఓవర్లో బౌండరీలతో పంజాబ్ బౌలర్లపై దాడికి దిగారు. దీంతో చెన్నై స్కోరు వేగం పుంజుకున్నట్టే అనిపించింది. కానీ హర్‌ప్రీత్ బ్రర్ ఒకే ఓవర్లో రహానే, దూబేను ఔట్ చేసి చెన్నైకి షాకిచ్చాడు. మరుసటి ఓవర్లో రాహుల్ చాహర్.. జడేజా (2)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆ జట్టు కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. 7-15 ఓవర్ల మధ్య స్పిన్నర్లతో పాటు రబాడా చెన్నైని కట్టడిచేయడంతో ఆ జట్టు 47 పరుగులు మాత్రమే చేయగలిగింది. సమీర్ రిజ్వీ (21) నెమ్మదిగా ఆడాడు. కరన్ వేసిన 17వ ఓవర్లో సిక్సర్‌తో అర్ధ సెంచరీ పూర్తిచేసిన గైక్వాడ్.. ఆ ఓవర్లో 20 పరుగులు రాబట్టాడు. అర్ష్‌దీప్ 18వ ఓవర్లో అతడు ఔట్ అయినా ఆఖర్లో ధోనీ (11 బంతుల్లో 14, 1 ఫోర్, 1 సిక్సర్) మెరుపులతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు చేసింది.

### పంజాబ్ రిస్క్ లేకుండా..

లక్ష్య ఛేదనలో పంజాబ్ ఆరంభంలోనే ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (13) వికెట్‌ను కోల్పోయింది. కానీ గత మ్యాచ్ హీరో బెయిర్ స్టో.. మూడో స్థానంలో వచ్చిన రూసోతో కలిసి పంజాబ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ముస్తాఫిజుర్ 5వ ఓవర్లో రూసో రెండు బౌండరీలు బాదగా శార్దూల్, జడేజా, మొయిన్ అలీ ఓవర్లలో ఓవర్‌కు రెండు ఫోర్లకు తగ్గకుండా దంచాడు. కానీ ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ జోడీని దూబే విడదీశాడు. అతడు వేసిన పదో ఓవర్లో బెయిర్ స్టో.. ధోనీకి క్యాచ్ ఇవ్వడంతో 64 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. దూకుడుగా ఆడుతున్న రూసోను ఠాకూర్ 12వ ఓవర్లో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత చెన్నై సారథి పంజాబ్ బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చేందుకు యత్నించినా శశాంక్ సింగ్ (25 నాటౌట్), సారథి సామ్ కరన్ (26 నాటౌట్) లు సీఎస్కేకు ఆ అవకాశమివ్వలేదు.

**సంక్షిప్త స్కోర్లు**

చెన్నై: 20 ఓవర్లలో 162/7 (రుతురాజ్ 62, రహానే 29, చాహర్ 2/16, బ్రర్ 2/17). పంజాబ్: 17.5 ఓవర్లలో 163/3 (బెయిర్ స్టో 46, రూసో 43, దూబే 1/14, గ్లీసన్ 1/30)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 9 | 8 | 1 | 0.69 | 16 |
| కోల్‌కతా | 9 | 6 | 3 | 1.09 | 12 |
| లక్నో | 10 | 6 | 4 | 0.09 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 0.62 | 10 |
| హైదరాబాద్ | 9 | 5 | 4 | 0.07 | 10 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| పంజాబ్ | 10 | 4 | 6 | -0.06 | 8 |
| గుజరాత్ | 10 | 4 | 6 | -1.11 | 8 |
| ముంబై | 10 | 3 | 7 | -0.27 | 6 |
| బెంగళూరు | 10 | 3 | 7 | -0.41 | 6 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## బోపన్న జోడీకి నిరాశ

- ప్రిక్వార్టర్స్‌లో నాదల్ ఔట్



మ్యాడ్రిడ్: స్పెయిన్ వేదికగా జరుగుతున్న మ్యాడ్రిడ్ ఓపెన్‌లో ఇండో-ఆస్ట్రేలియా జోడీ రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్‌కు తొలి రౌండ్‌లోనే నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (4/7), 5-7 తేడాతో సెబాస్టియన్ కోర్డా-జోర్డన్ థామ్సన్ చేతిలో చిత్తయ్యారు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్ 5-7, 4-6 తేడాతో 22 ఏండ్ల చెక్ రిపబ్లిక్ కుర్రాడు జిరి లెహెక చేతిలో ఓడిపోయాడు.

## భారత్ మ్యాచ్‌లన్నీ లాహోర్‌లోనే!

- ఐసీసీకి పాకిస్థాన్ ప్రతిపాదన

కరాచీ: వచ్చే ఏడాది జరగాల్సి ఉన్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్.. భారత్‌ను ఎలాగైనా తమ దేశానికి రప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ మెగా టోర్నీ కోసం లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికలను ఖరారుచేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. భారత్ ఆడే మ్యాచ్‌లను లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో మాత్రమే జరిపిస్తామని, భద్రత విషయంలో టీమ్‌ఇండియాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని ఐసీసీకి విన్నవించనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. అయితే ఈ ప్రతిపాదన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ని సంప్రదించకుండానే చేస్తున్నట్టు తెలుస్తోంది.

## హార్దిక్‌కు రెండోసారి జరిమానా

ఢిల్లీ: ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యా ఐపీఎల్-17లో రెండోసారి జరిమానా ఎదుర్కొన్నాడు. మంగళవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో భాగంగా నిర్దేశిత సమయంలో ఓవర్ల కోటాను పూర్తిచేయకపోవడంతో అతడిపై ఫైన్ పడినట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. హార్దిక్‌కు రూ.24 లక్షల జరిమానా విధించగా జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత లేదా రూ.6 లక్షల ఫైన్ (ఏది తక్కువైతే అది) విధించినట్టు బీసీసీఐ వెల్లడించింది. గతంలో పంజాబ్‌తో మ్యాచ్‌లోనూ హార్దిక్ జరిమానాకు గురయ్యాడు.

## కంగారూల జట్టిదే..



మెల్‌బోర్న్: టీ20 వరల్డ్ కప్ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బుధవారం తమ జట్టును ప్రకటించింది. మిచెల్ మార్ష్ సారథిగా వ్యవహరించనున్న 15 మంది సభ్యులలో వెటరన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌తో పాటు ఐపీఎల్‌లో మెరుపులు మెరిపిస్తున్న జేక్ ఫ్రేజర్‌కు చోటు దక్కలేదు. ఈ ఏడాది టెస్టులు, వన్డేల నుంచి తప్పుకున్న డేవిడ్ వార్నర్ జట్టులో స్థానాన్ని నిలుపుకున్నాడు. వికెట్ కీపర్లుగా జోష్ ఇంగ్లిస్, మాథ్యూ వేడ్ ఉన్నారు. ఐపీఎల్‌లో విఫలమవుతున్నా మ్యాక్స్‌వెల్‌కు జట్టులో చోటు దక్కింది.

**ఆస్ట్రేలియా జట్టు:** మిచెల్ మార్ష్ (కెప్టెన్), ఆస్టన్ అగర్, పాట్ కమిన్స్, టిమ్ డేవిడ్, నాథన్ ఎల్లీస్, కామెరూన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్, మాథ్యూ వేడ్, డేవిడ్ వార్నర్, ఆడమ్ జంపా

## రష్మిక శుభారంభం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఫ్లోరిడా(అమెరికా) వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ యువ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక ఆకట్టుకుంది. బుధవారం జరిగిన టోర్నీ మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-0, 6-0తో సియా కారికోవ్(అమెరికా)పై అలవోక విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన పోరులో ఆధిపత్యం ప్రదర్శించింది.

## 'చాలా బాధ కల్గింది'

- రింకూ ఎంపిక కాకపోవడంపై తండ్రి ఆవేదన



న్యూఢిల్లీ: వెస్టిండీస్, అమెరికా వేదికలుగా వచ్చే నెలలో జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీకి రింకూసింగ్‌ను ఎంపిక చేయకపోవడంపై కుటుంబసభ్యులు తీవ్ర నిరాశ చెందారు. మెగాటోర్నీ కోసం బీసీసీఐ సెలెక్షన్ కమిటీ 15 మందితో ఎంపిక చేసిన జట్టులో కాకుండా రింకూసింగ్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. ఈ క్రమంలో రింకూ తండ్రి కాన్ చంద్రసింగ్ స్పందిస్తూ 'టీ20 ప్రపంచకప్ టోర్నీకి రింకూ ఎంపికపై ఆశలు పెట్టుకున్నాం. సంబురాలు చేసుకునేందుకు స్వీట్లు, పటాకులు తెచ్చిపెట్టుకున్నాం. కానీ మా అంచనాలు తలకిందులయ్యాయి. జట్టు ప్రకటించిన తర్వాత రింకూ..తల్లితో బాధగా మాట్లాడాడు' అని ఒకింత ఆవేదనగా చెప్పాడు.

# వాణిజ్య

## హైదరాబాద్‌లో అర్బన్‌వర్క్ నూతన సెంటర్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ సేవల సంస్థ అర్బన్‌వర్క్..హైదరాబాద్‌లో తాజాగా మరో సెంటర్‌ను ప్రారంభించింది. హై-టెక్ సిటీలోని రహేజా మైండ్‌స్పేస్‌లో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 900 మంది కూర్చోవడానికి వీలుంటుంది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో డిజైన్ చేసిన ఈ సెంటర్‌లో 50 నుంచి 500 లోపు ఉద్యోగ సామర్థ్యం కలిగిన సంస్థలు ఇక్కడి నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని తెలిపింది.

## లగ్జరీ హౌసింగ్‌లో హైదరాబాద్ సత్తా

**సీబీఆర్‌ఈ ఇండియా మార్కెట్ మానిటర్‌లో వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): విలాసవంతమైన గృహాల కార్యకలాపాల్లో హైదరాబాద్‌కు మూడో స్థానం లభించింది. దేశ ఆర్థిక రాజధాని ముంబై మొదటి స్థానంలో ఉండగా, రాజధాని ఢిల్లీ రెండో స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానం హైదరాబాద్‌కు దక్కిందని సీబీఆర్‌ఈ తాజాగా వెల్లడించింది. ఇండియా మార్కెట్ మానిటర్ క్యూ1-2024 పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. రూ.4 కోట్ల నుంచి రూ.20 కోట్ల లోపు విలువచేసే వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లు అమ్మకాలు 10 శాతం వృద్ధిని సాధించాయి.

## సిటీ కార్డులు యాక్సిస్ బ్రాండ్‌కు

న్యూఢిల్లీ, మే 1: యాక్సిస్ బ్యాంక్ బ్రాండ్‌లోకి సిటీ బ్యాంక్ కస్టమర్ల కార్డుల మార్పు ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు సదరు ఖాతాదారులకు సందేశాలు వస్తున్నాయి. సిటీ బ్యాంక్ భారతీయ రిటైల్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సిటీ బ్రాండ్ కింద ఉన్న కార్డుల రీబ్రాండింగ్ జరుగుతున్నది. ఈ క్రమంలోనే తమ కొత్త ఐఎఫ్‌ఎస్‌సీని అప్‌డేట్ చేసుకోవాలని కార్డుదారులను యాక్సిస్ బ్యాంక్ కోరుతున్నది. కాగా, కార్డు బ్రాండ్ ఒక్కటే మారనున్నది. సిటీకి బదులు యాక్సిస్ అని వస్తుంది. దాని మీదున్న నంబర్లన్నీ అలాగే ఉండనున్నాయని గతంలోనే యాక్సిస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ చౌదరి చెప్పారు.



# వాహన అమ్మకాల జోరు


న్యూఢిల్లీ, మే 1: వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. నూతన ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే వాహన అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతోపాటు సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండటంతో స్వల్పంగా ప్రభావం చూపాయి. మొత్తంగా గత నెలలో 3,38,341 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3,32,468లతో పోలిస్తే 1.77 శాతం పెరిగాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్‌లు సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకోగా, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ రెండంకెల వృద్ధిని సాధించాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ పుంజుకునే అవకాశాలున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

**ఏప్రిల్ నెలలో మొత్తం విక్రయాలు**

| సంస్థ | 2024 | 2023 | వృద్ధి (%లో) |
|---|---|---|---|
| మారుతి సుజుకీ | 1,68,089 | 1,60,529 | 4.7 |
| టాటా మోటర్స్ | 77,521 | 69,599 | 11.5 |
| హ్యుందాయ్ | 63,701 | 58,201 | 9.5 |
| టయోటా కిర్లోస్కర్ | 20,494 | 15,510 | 32 |
| ఎంజీ మోటర్ | 4,485 | 4,551 | -1.45 |
| వీఈసీవీ | 5,377 | 6,567 | -18.1 |
| ద్విచక్ర వాహనాలు | | | |
| టీవీఎస్ మోటర్ | 3,83,615 | 3,06,224 | 25 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 81,870 | 73,136 | 12 |

# తులం రూ.2 లక్షలు!

**గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్న అంచనాలు • నిపుణులు ఏమంటున్నారు?**



న్యూఢిల్లీ/ముంబై, మే 1: తులం బంగారం ధర రూ.2 లక్షల మార్కును తాకబోతున్నదా?.. దేశీయ గోల్డ్ మార్కెట్‌ను ఈ అంచనా ఇప్పుడు షేక్ చేస్తున్నది. అవును.. ప్రస్తుతం రికార్డు స్థాయి దరిదాపుల్లో కదలాడుతున్న పసిడి రేట్లు.. ముున్ముందు మరింత పెరుగుతాయంటున్నారు. ఈ క్రమంలోనే 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి విలువ లక్ష రూపాయలు కాదు.. ఏకంగా రూ.2 లక్షలు పలుకుతుందని ట్రేడింగ్ వర్గాలు చెప్తుండటం గమనార్హం.

### ఇదీ లెక్క..

గడిచిన 9 ఏండ్లలో భారతీయ మార్కెట్‌లో బంగారం ధర మూడింతలైంది. 2015లో 10 గ్రాములు రూ.24,740గా ఉన్నది. కానీ ఇప్పుడు రూ.75,000కు అటుఇటుగా వచ్చింది. అంటే 2015తో పోల్చితే 2024కల్లా మూడింతలు పెరిగింది. అలాగే 2006లో తులం రూ.8,250గా నమోదైంది. అక్కడి నుంచి 9 ఏండ్లకు ఇది మూడింతలై.. 2015లో రూ.25,000 మార్కును సమీపించింది. ఈ నేపథ్యంలోనే వచ్చే 7 నుంచి 12 ఏండ్లలో తులం పసిడి ధర దేశీయ మార్కెట్‌లో రూ.2 లక్షల్ని దాటేస్తుందని మార్కెట్‌లో గట్టిగా వినిపిస్తున్నది. నిజానికి రోజులు గడుస్తున్నకొద్దీ బంగారం ధరలు గణనీయంగా పెరుగడానికి కారణం.. పుత్తడిని కేవలం ఓ ఖరీదైన అలంకరణ సాధనంగానేగాక పెట్టుబడిగా చూసేవారు ఎక్కువైపోవడమే. 1987లో 10 గ్రాములు రూ.2,570గా ఉన్నది. 19 ఏండ్ల తర్వాత 2006లో ఇది దాదాపు మూడింతల ధరకు చేరింది. కానీ ఆ తర్వాత ధరలు పరుగులు పెట్టడాన్ని గమనించవచ్చు. ఇందుకు కారణం మదుపరులలో మారిన ఆలోచనా వైఖరేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ధోరణి ఇంకా పెరుగుతూపోతే 2030కల్లా తులం బంగారం రేటు రూ.2 లక్షలకు చేరువ కావడం ఖాయమేనన్న అంచనాలు బలంగా ఉన్నాయి.

### గత ఐదేండ్లలో..

గత ఐదేండ్లలో బంగారం ధరలు రివ్వున ఎగిసి పడటానికి వెనుక అనేక కారణాలు, అంశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ బలహీనపడటం, భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, కరోనా మహమ్మారితో ఏర్పడ్డ పరిణామాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటివి గోల్డ్ రేటు వృద్ధిలో 75 శాతానికి కారణమయ్యాయి. ఈ 3.3 ఏండ్లలోనే తులం ధర రూ.40,000 నుంచి రూ.70,000 దాటేసింది. అంతకుముందు 2014 నుంచి 2018 వరకు పెరిగింది 12 శాతమే. రూ.28,000 నుంచి రూ.31,250కి చేరింది. కానీ ఆ తర్వాత రాకెట్ వేగాన్ని అందుకోవడం గమనించవచ్చు. అప్పుడే కరోనా, యుద్ధం, అనిశ్చితి, రూపీ నష్టాలు బాగా పెరిగాయి.

### నిపుణుల మాట..

దేశ, విదేశీ స్టాక్ మార్కెట్లతోపాటు ఇతర పెట్టుబడులకు ప్రత్యామ్నాయ మార్గంగా మదుపరులకు కనిపిస్తున్నది బంగారమే. గోల్డ్‌ను ఓ సురక్షిత పెట్టుబడి సాధనంగా అంతా భావిస్తున్నారు మరి. అయినప్పటికీ ఆయా అంశాలు దీన్నీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. కానీ ఇతర ఇన్వెస్ట్‌మెంట్లతో చూస్తే తక్కువ రిస్క్ ఉంటున్నది. దీంతో బంగారంపై పెట్టుబడులు భవిష్యత్తులో ఆకర్షణీయ లాభాలనే అందిస్తాయని ఎక్స్‌పర్ట్స్ పేర్కొంటున్నారు. అయితే పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని కనబరుస్తూ ముందుకెళ్తే మరింత లాభాలను పొందవచ్చని, కనుక ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను మార్కెట్ నిపుణుల సలహాతో తీర్చిదిద్దుకోవాలని సూచిస్తున్నారు. బంగారాన్ని భౌతికం (నగలు)గా కాకుండా బాండ్లు, ఇతరత్రా మార్గాల్లో మదుపు చేసుకోవడం ఉత్తమమని పేర్కొంటున్నారు.

## ఎఫ్‌పీఐలు వెనక్కి

న్యూఢిల్లీ, మే 1: వరుసగా రెండు నెలల పాటు దేశీయ ఈక్విటీ మార్కెట్లలో భారీగా నిధులు చొప్పించిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఏప్రిల్ నెలలో మాత్రం రూ.8,700 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అమెరికా బాండ్ ఈల్డ్ రేట్లు భారీగా పెరగడం ఇందుకు కారణం. మార్చి నెలలో నికరంగా రూ.35 వేల కోట్లు, ఫిబ్రవరిలో రూ.1,539 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌ఐఐలు..ఆ తర్వాతి నెలలో మాత్రం భారీగా వెనక్కి తీసుకున్నారు. మొత్తంమీద ఈ ఏడాది ఇప్పటి వరకు ఈక్విటీ మార్కెట్లోకి రూ.2,222 కోట్లు, డెబిట్ మార్కెట్లలోకి రూ.44,908 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

### ఫెడ్ వడ్డీరేట్లు యథాతథమే!

అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. రెండు రోజుల పాటు ఇక్కడ జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) సమావేశమై వడ్డీరేట్లను యథాతథంగా 5.25 శాతం నుంచి 5.50 శాతంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో వడ్డీరేట్లు యథాతథంగా ఉండటం ఇది ఆరోసారి.

# 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

## ఏప్రిల్ నెలలో సరికొత్త రికార్డు • తొలిసారిగా ఈ మైలురాయికి



న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు మరో మైలురాయికి చేరుకున్నాయి. ఏప్రిల్ నెలకుగాను రూ.2 లక్షల కోట్లకు పైగా వసూలయ్యాయి. దేశ ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, దేశీయ లావాదేవీలు అధికం కావడంతో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఇంతటి గరిష్ఠ స్థాయిలో పన్ను వసూలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.87 లక్షల కోట్లతో పోలిస్తే 12.4 శాతం అధికమని పేర్కొంది. పన్ను అధికారుల కృషి వల్లనే ఇది సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి బకాయిలు లేవని, ఇప్పటి వరకు ఉన్న బకాయిలన్నింటినీ చెల్లించామన్నారు. ఈ సందర్భంగా డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి మాట్లాడుతూ..ఉత్పత్తి, వినిమయ రాష్ర్టాలు అంచనాలకుమించి రాణించడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు. భవిష్యత్తులోనూ మరింత పెరిగే అవకాశం కూడా ఉందన్నారు.

**తెలంగాణలో 6,236 కోట్లు**


తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. గత నెలకుగాను రూ.6,236 కోట్లు వసూలయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.5,622 కోట్లతో పోలిస్తే 11 శాతం అధికం కావడం విశేషం. అటు ఆంధ్రప్రదేశ్‌లో రూ.4,850 కోట్లు జీఎస్టీ వసూలయ్యాయి.

**ఏప్రిల్ 2024లో జీఎస్టీ వసూళ్లు..**

- సెంట్రల్ జీఎస్టీ కింద రూ.43,846 కోట్లు
- స్టేట్ జీఎస్టీ కింద రూ.53,538 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.99,623 కోట్లు(దిగుమతి చేసుకునే వస్తువులపై విధించిన 37,826 కోట్లు కలుపుకొని)
- సెస్ రూపంలో రూ.13,260 కోట్లు (రూ.1,008 కోట్లు కలుపుకొని)

# నామినేషన్ తప్పనిసరి కాదు

**జాయింట్ మ్యూచువల్ ఫండ్ ఖాతాదారులకు సెబీ ఊరట**



న్యూఢిల్లీ, మే 1: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. జాయింట్ మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియో నిర్వహణదారులకు ఊరటనిచ్చింది. సంయుక్తంగా నిర్వహించే మ్యూచువల్ ఫండ్ ఖాతాల కోసం నామినేషన్ తప్పనిసరేమీ కాదని బుధవారం స్పష్టం చేసింది. సులభతర వ్యాపార విధానా (ఈవోడీబీ)ల్లో భాగంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. అలాగే కమోడిటీ, విదేశీ పెట్టుబడులను పర్యవేక్షించేందుకు ఒకే ఫండ్ మేనేజర్‌ను పెట్టుకునేలా మ్యూచువల్ ఫండ్ సంస్థలకు అనుమతినిచ్చింది. దీనివల్ల ఫండ్ నిర్వహణ వ్యయభారం తగ్గుతుందని పేర్కొన్నది. కాగా, సెబీ ఏర్పాటుచేసిన ఓ కార్యాచరణ బృందం.. మ్యూచువల్ ఫండ్ రెగ్యులేషన్స్‌ను సమీక్షించి, మెరుగైన ఈవోడీబీ ప్రమాణాలను సిఫార్సు చేసిన నేపథ్యంలోనే తాజా నిర్ణయాలు వచ్చాయి. ప్రజాభిప్రాయం మేరకే ఈ రెండు నిర్ణయాలను తీసుకున్నట్టు సెబీ కూడా తెలియజేసింది. 'సంయుక్తంగా నిర్వహించే మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోస్ కోసం నామినేషన్‌ను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఐచ్ఛికంగా తీసుకోవచ్చు. వీలుంటే చేసుకోవచ్చు లేదంటే మానుకోవచ్చు' అని ఓ సర్క్యులర్‌లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) తెలిపింది. దీంతో ఈ సడలింపులు జాయింట్ హోల్డర్స్‌కు లాభించగలవని ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలావుంటే వ్యక్తిగత మ్యూచువల్ ఫండ్ నిర్వహణదారులంతా కూడా జూన్ 30కల్లా నామినేషన్‌ను ఎంచుకోవాల్సిందేనని సెబీ తేల్చిచెప్పింది. లేకపోతే ఉపసంహరణలకు వీల్లేకుండా ఖాతాలను స్తంభింపజేస్తామని హెచ్చరించింది. కమోడిటీ మార్కెట్‌లో పాల్గొనే గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌ల వంటి కమోడిటీ ఆధారిత ఫండ్స్, ఇతర ఫండ్స్.. డెడికేటెడ్ ఫండ్ మేనేజర్‌ను నియమించుకోవడం కూడా ఐచ్ఛికమే. విదేశీ పెట్టుబడులకూ ఇది వర్తిస్తుంది.